క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రూరల్ సీఐ మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో శుక్రవారం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్‌తో కలిసి సీఐ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు నిత్యం విధి నిర్వహణలో సతమవుతుంటారని వారికి క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగుతుందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప, నాయకులు దావీదు, దేవపాల్, రామాంజినేయులు, శాంతిరాజు,కౌలన్న, రాజు, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దమాంబ అమ్మవారి ఊరేగింపు



ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

మద్దికెర: స్థానిక మద్దమాంబ దేవాలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గ్రామానికి 4 కి.మీ దూరంలో నల్లరేగడి పొలాలలో ఉన్న మద్దమ్మ అమ్మవారి పాదాల వద్ద పూజలు నిర్వహించి ఆచారం ప్రకారం యాదవరాజును పూల సంకెళ్లతో బంధించి కలశాలతో నీటిని ఊరేగింపుగా గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో వచ్చి అనంతరం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం



ఆలూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆలూరు రూరల్: అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు.. చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి పోలీసు స్టేషన్ల పరిధిలో 16 కేసులలో పట్టుబడిన 116 బాక్సుల కర్ణాటక మద్యం, 5 లీటర్ల నాటుసారాను శుక్రవారం ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన మద్యం విలువ రూ.5,80,000 ఉంటుందని చెప్పారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు డాక్టర్ నాయక్, నాగేంద్ర, వరప్రసాద్, శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ నుంచి టీడీపీలోకే..!

గోనెగండ్ల: మండలంలోని తిప్పనూరు గ్రామానికి చెందిన డేవిడ్, రంగడు, గోవర్ధన్‌లు అనే వ్యక్తులు టీడీపీకి చెందిన వారే అయినా మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరడం చూసి గ్రామస్తులు నవ్వుకుంటున్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి వేముగోడు గ్రామంలో పర్యటిస్తున్న సందర్భంగా ఆయన సమక్షంలో తిప్పనూరు గ్రామ టీడీపీ నాయకులు డేవిడ్, రంగడు, గోవర్ధన్‌లతో పాటు మరో పది మంది టీడీపీలోకి చేరారు. దీనిపై ఆ పార్టీ వాళ్లని వారే చేర్చుకుంటున్నారా అని తిప్పనూరు గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు. దీనిపై సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సరిత, ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు టీడీపీలో ఉంటూ మళ్లీ చేరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నారా లోకేష్ గోనెగండ్ల మండలంలో పాదయాత్ర చేస్తున్నప్పుడు వారు ఆయన వెంటే నడిచారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసిన ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ప్రజా మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని స్పష్టం చేశారు.

జయప్రదం చేయండి

దేవనకొండ: సెప్టెంబర్ 2వ తేదీన ఆలూరులో నిర్వహించే సీపీఐ బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, పట్టణ సహాయ కార్యదర్శి వి.రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయ ఆవరణలో వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక పాత బస్టాండులో భారీ బహిరంగసభను విజయవంతం చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కె.మద్దిలేటిశెట్టి, ఏఐఎస్‌ఎఫ్ మండల సమితి సభ్యులు సురేంద్ర, రైతుసంఘం మండల సీనియర్ నాయకుడు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మంచి జరిగింటేనే ఓటెయ్యండి

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- ఎన్నికలు దగ్గర పడ్తున్న కొద్ది పగటి వేషగాళ్లు వస్తున్నారు జాగ్రత్త
- కుల రాజకీయాలు చేసేవారికి బుద్ధి చెప్పాలి
- లింగంపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కు విశేష స్పందన

హొళగుంద: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, నా నుంచి మీకు మంచి జరిగి ఉంటే ఓటెయ్యండని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం విన్నవించారు. ఎన్నికలు దగ్గర పడ్తున్న కొద్ది కొత్త బిచ్చగాళ్లు ఎక్కువయ్యారని వారి మాయమాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులుతో కలిసి లింగంపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయి, సమస్యలతో వచ్చే వారితో ఎలా నడుచుకుంటున్నారు, తదితర విషయాల గురించి ఆరా తీశారు. నవరత్నాలు, ఇతర పథకాలను ప్రజలకు నేరుగా ఇంటి వద్దకే అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాన్ని నెరవేర్చాలని సూచించారు.

కుల రాజకీయాలను తిప్పికొట్టాలి

మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని కులాల వారు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉంటున్నారని, గొడవలు పడే వారిని రాజీ చేసి ప్రశాంత వాతవరణం కల్పించామన్నారు.మరో ఆరేడు నెలల్లో ఎన్నికలు ఉండడంతో కొందరు కొత్త బిచ్చగాళ్లు కుల రాజకీయాలు చేయడానికి వస్తున్నారని, ఇలాంటి మాయగాళ్ల మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పొరపాటు జరిగి ఉంటే సరిచేస్తామన్నారు.

నాలుగేళ్లలో గ్రామానికి రూ.11.25 కోట్లు లబ్ధి

వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో లింగంపల్లి గ్రామానికి సంక్షేమ పథకాలు, బీమా ద్వారా రూ.11.25 లబ్ధి చేకూరిందన్నారు. గ్రామానికి సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షలతో కల్వర్టులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని అధికారులు ఆదేశించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా నాలుగేళ్లలో వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. సీఎం జగనన్న పాలనపై ప్రజల అభిప్రాయాన్ని అడగ్గా ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన నర్సింగ్ విద్యార్థిని మాల గీత కుటుంబాన్ని పరామర్శించి



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తుడిని ఆరా తీస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

తండ్రి మల్లికార్జునకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, మల్లికార్జున, మౌనేష్, శంబులింగ, ఈశ్వర్, భీమ్‌రెడ్డి, మారుతి, సీతారామిరెడ్డి, అయ్యాళప్ప, ఎస్కే గిరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

ఆలూరు: గ్రామస్తులకు ఇచ్చిన హామీని నెరవేర్చి రూ.2 కోట్లతో 3 కి.మీ బీటీ రోడ్డు మంజూరు చేయించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను శుక్రవారం రాత్రి గ్రామ సర్పంచ్ షేకున్‌బీ సమక్షంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పూలమాలలతో ప్రత్యేకంగా సన్మానించారు. గ్రామస్తుల విన్నపం మేరకు శ్రీరాములమ్మ, దేవాలయం



వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న మంత్రి

వరకు రోడ్డు, అర్థగేరి రస్తా, చెరువు కట్ట సమీపంలో వంతెన, అగ్రహారం గ్రామానికి తాగునీటి సదుపాయం, హత్తిబెళగళ్ గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ మంజూరు కోసంకృషిచేస్తానని మంత్రి హామీఇచ్చారు.

భూ పంపిణీకి సిద్ధం

తుగ్గలి: మండలంలో పలు గ్రామాల్లో నిరుపేదలకు భూ పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ రవి శుక్రవారం తెలిపారు. మొత్తం 232 మందికి పంపిణీ చేసేందుకు 299.61 ఎకరాల భూమిని సిద్ధం చేశామన్నారు. త్వరలో అసైన్ కమిటీ ద్వారా లబ్ధిదారులకు పట్టాలు అందిస్తామని వెల్లడించారు.

పింఛన్ దరఖాస్తుల తనిఖీ

తుగ్గలి: కొత్తగా మంజూరైన పింఛన్లకు సంబంధించి వెరిఫికేషన్ చేసినట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. పింఛన్ల కోసం మండలంలో 18 సచివాలయాల పరిధిలో 300 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిలో మంజూరైన 162 పింఛన్లకు సంబంధించి వెరిఫికేషన్ పూర్తి చేసినట్లు ఆమె చెప్పారు. త్వరలో ప్రభుత్వం వారికి పింఛన్ సొమ్ము అందిస్తుందన్నారు.

వాల్ పోస్టర్లు విడుదల

ఆస్పరి: వేదావతి ప్రాజెక్టు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర సెప్టెంబర్ 2వ తేదీన ఆలూరుకు చేరనున్న సందర్భంగా శుక్రవారం ఆస్పరిలో ఆ పార్టీ నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి, కృష్ణమూర్తి, ఉరుకుందప్ప, రంగన్న, రంగప్ప తదితరులు బస్సు యాత్ర వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేదావతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు జరిగేలా చూడాలని, ప్రాజెక్టు ద్వారా ఆస్పరి మండలానికి తాగు, సాగు నీరు అందించాలని కోరారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళాభ్యున్నతి సాధ్యమవుతోందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, పొదుపు మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమ కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు శ్రీకారం చుట్టారన్నారు. అక్షరాస్యత శాతం పెంచేందుకు అమ్మఒడి, వసతి దీవెన లాంటి పథకాలకు మంజూరయ్యే సొమ్మును తల్లుల ఖాతాలకే జమ చేయడం జరుగుతోందన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 15,252 మంది రూ.3.25 కోట్లు లబ్ధి పొందారన్నారు. నాలుగేళ్ల సీఎం వైఎస్ జగన్ పాలనలో మహిళలు అనేక విధాలుగా ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందారని తద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందుతున్నాయని వివరించారు. పట్టణాలు, గ్రామాల్లో మహిళలు స్వయంగా ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకొనేలా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. మెప్మా సభ్యులు భవాని, రత్నమ్మ, పార్వతి, విజయలక్ష్మి, గౌరమ్మ, పుష్ప, సునీత, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలువ నీటి పంపింగ్ ప్రారంభం

మద్దికెర: హంద్రీ–నీవా కాలువకు నీరు రావడంతో గ్రామంలోని మద్దమ్మకుంటకు నీటి పంపింగ్ చేయడాన్ని శుక్రవారం సర్పంచ్ సుహాసిని, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత ప్రారంభించారు. అనంతరం గంగ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి నీటి కొరత తీర్చేందుకు నిరంతర విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 గంటల పాటు నీటిని పంపింగ్ చేసి మద్దమ్మ చెరువును నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువులో నీరుంటే గ్రామంలో బావులు, బోర్లు, భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఈఓ శ్రీహరి, ఎంపీటీసీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చెరువు వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హంద్రీ-నీవా నీటితో పైర్లకు జీవం



ట్యాంకర్లతో పొలంలోని కుంటను నింపి పైర్లకు నీటి తడులు అందిస్తున్న రైతు కారుమంచప్ప

చిప్పగిరి: హంద్రీ–నీవా కాలువలకు నీటిని అందించడంతో ఖరీఫ్‌లో సాగుచేసిన పైర్లకు జీవం పోసినట్లయ్యింది. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు కంది, పత్తి, మిరప, సజ్జ, వేరుశనగ తదితర పంటలు సాగుచేశారు. విత్తనం వేసింది మొదలు ఎక్కడా సరైన మోతాదులో వర్షం కురవకపోవడంతో పైర్లు వాడుముఖం పట్టాయి. ఈ స్థితిలో ప్రభుత్వం హంద్రీ నీవాకు నీటిని విడుదల చేయడంతో పైర్లకు జీవం పోసినట్లయ్యింది. ఆయకట్టు కింద రైతులు విద్యుత్, డీజిల్ మోటార్లలో పైర్లకు నీటి తడులు అందిస్తుండగా కొందరు ట్యాంకర్లతో నీటిని తరలించి పొలంలోని కుంటల్లో నింపి పైర్లకు నీటి తడులు పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా వర్షాలు కురిస్తే పెట్టుబడి భారం తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను పట్టుకున్నట్లు సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో నిందితులను అరెస్ట్ చూయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బనవాసి గ్రామం ఎల్ఎల్‌సీ కెనాల్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కేఏ 02 ఎంజీ 5732 నంబర్ గల కారులో ముగ్గురు వ్యక్తులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. నిందితులు కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మట్టురు గ్రామానికి చెందిన బసవరాజు, కొప్పల్ జిల్లా హంసిహాల్‌కు చెందిన మౌనేష్, ఎమ్మిగనూరు మండలం గుడేకల్‌కు చెందిన బోయ ఉరుకుందును అరెస్ట్ చేసి కారును సీజ్ చేశామన్నారు. వారి నుంచి 3 బాక్సులు 288 ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను (90 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ చెప్పారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తున్నా, విక్రయిస్తున్నట్లు తెలిసినా (సెబ్ సీఐ సెల్ నంబర్ 9440902579) కు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో సెబ్ హెచ్‌సీలు గోపాల్, లింగప్రసాద్, రబ్బాని, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్ రావు

చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు



టౌన్ ఎస్‌ఐ మస్తాన్‌వలికి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎమ్మిగనూరురూరల్: ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు, టీడీపీ నేతలు లోకేష్, అచ్చెంనాయుడుపై శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ మన్సూర్‌బాషా ఆధ్వర్యంలో పట్టణ ఎస్‌ఐ మస్తాన్‌వలికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం యువగళం పాదయాత్రలో నారా లోకేష్ మాట్లాడుతూ.. ఎవరైతే ఎక్కువ గొడవలు పెట్టుకొని కేసులు ఉంటాయో వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పడం, పుంగనూరు, మాచెర్లలో చంద్రబాబునాయుడు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కార్యకర్తలను దాడులకు పురిగొల్పడం, అలాగే అచ్చెంనాయుడు కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రశాంతతకు భంగం కలిగించేలా కుట్రలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యులు షరీఫ్, సుల్తాన్, ఆసీఫ్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

కోలుకోలేక నర్సింగ్ విద్యార్థిని మృతి



గీత (ఫైల్)

హొళగుంద: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో ఈ నెల 17న ఆత్మహత్యకు ప్రయత్నించిన నర్సింగ్ విద్యార్థిని మాల గీత (20) శుక్రవారం కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సదరు విద్యార్థిని నర్సింగ్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఈ నెల 17న ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రంగా గాయపడిన గీతను కుటుంబ సభ్యులు బళ్లారి ఓపీడీలో చేర్పించగా కోలుకోలేక శుక్రవారం మృతి చెందింది. గీత తండ్రి మల్లికార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రెండు బైక్‌లు అపహరణ

తుగ్గలి: మండల పరిధిలోని పగిడిరాయిలో గురువారం రాత్రి రెండు బైక్‌లు అపహరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రామచంద్ర ఇంటి వద్ద ఉంచిన పల్సర్, హీరో హోండా బైక్‌లను దొంగలు అపహరించుకు వెళ్లారు. ఈ మేరకు బాధితులు శుక్రవారం జొన్నగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హెబ్బటంలో చోరీ



బీరువాను పగులగొట్టి చోరీ చేసిన దృశ్యం

హొళగుంద: హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని హెబ్బటం గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడ్డారు. ఒక ఇంట్లో బంగారం, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు మరో ఇంట్లో చోరీకి యత్నించగా ఏమీ దొరక్కపోవడంతో పరారయ్యారు. హెబ్బటం బస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న మల్లికార్జున స్వామి కుటుంబ సభ్యులు మిద్దెపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఇంట్లో చొరబడిన దుండగులు బీరువా తెరిచి తులంన్నర బంగారం కలిగిన జత కమ్మలు, రెండు రింగులతో పాటు రూ.50 వేల నగదును ఎత్తికెళ్లినట్లు బాధితులు శుక్రవారం తెలిపారు. ఆ ఇంటి పక్కనే ఉన్న అతని సోదరుడు చిన్న హంపయ్య స్వామి ఇంట్లో కూడా ప్రవేశించిన దొంగలు బీరువాను పగలగొట్టి చూడగా ఏమీ దొరకక పోవడంతో వెనుదిరిగినట్లు చెప్పారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోరెన్సిక్ సిబ్బందిని రప్పించి ఘటనా స్థలంలో దుండగుల వేలిముద్రలు సేకరించారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామ సమీపంలో 167 జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. హాలహర్వి, చిలకడోణ గ్రామాల మధ్య అంజనేయ స్వామి విగ్రహం వద్ద ఆగి ఉన్న లారీని మంత్రాలయం నుంచి వెళుతున్న లారీ వేగంగా ఢీకొంది. డ్రైవర్ లక్ష్మన్ మాధవ్‌కు స్వల్ప గాయాలు కాగా అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అనంతరం స్వగ్రామం మహారాష్ట్రకు వెళ్లాడు. విశాఖపట్నం నుంచి మాధవరం వెళ్తూ లారీని నిలుపుకుని ఉన్న డ్రైవర్ వెంకటేష్, క్లీనర్ మధుసూదన్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. రెండు లారీలు దెబ్బతిన్నాయి. లారీ డ్రైవర్ వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఆనంద్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

నేడు మండల మీట్

వెల్దుర్తి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొమ్మన సరళారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారు లు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పార్టీ పదవుల్లో సమన్యాయం



ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మికాంత రెడ్డి



ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీరంగడు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ఎమ్మిగనూరు నియోజకవర్గానికి సముచిత స్థానం లభించిందని, ఐదుగురికి పదవులు ఇవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన నందవరం మండల కనకవీడు కేఆర్ లక్ష్మీకాంత రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కమిటీలో కార్యదర్శిగా కె.రియాజ్‌అహమ్మద్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్.సూర్యనారాయణ, స్థానిక కౌన్సిలర్ ఖాశీంబేగ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు బి.అన్నపూర్ణమ్మను నియమించారన్నారు. పదవులు పొందిన వారు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. నందవరం మండల నాయకులు శివప్పగౌడ్, పేట శ్రీనివాసరెడ్డి, విరుపాక్షిరెడ్డి,చాంద్ తదితరులు ఉన్నారు.

పత్తికొండటౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పత్తికొండకు చెందిన సి.శ్రీరంగడు నియమితులయ్యారు. ఇప్పటివరకు జిల్లా అధికార ప్రతినిధిగా ఉన్న ఆయనకు ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా శుక్రవారం పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పత్తికొండ నియోజకవర్గం నుంచి జిల్లా కార్యదర్శిగా టి.మల్లికార్జున యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎం.మోహన్‌రెడ్డి, ఎ.భారతి, ఎస్.నాగరాజులకు అవకాశం కల్పించారు.

నీటి విడుదలపై హర్షం

దేవనకొండ: కొత్తపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీ–నీవా కాలువకు జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ చేతులమీదుగా శుక్రవారం నీటిని విడుదల చేశారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చొరవ తీసుకొని హెచ్ఎంఎస్ కాలువ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారని జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, జయరాంరెడ్డి తెలిపారు. దేవనకొండ మండలంలో హెచ్ఎంఎస్ కాలువ కింద దేవనకొండ, వెలమకూరు, గుండ్లకొండ, కప్పట్రాళ్ల, నెల్లిబండ మీదుగా దాదాపు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. విపత్కర పరిస్థితుల్లో నీటిని విడుదల చేసినందుకు వివిధ గ్రామాల ప్రజలు మంత్రికి ధన్యాదాలు తెలిపారు. హెచ్ఎస్ఎస్ ఏఈ లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర పాల్గొన్నారు.



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

షరాఫ్ బజార్‌లో కారు బీభత్సం



ఘటన స్థలంలో గుమిగూడిన ప్రజలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని షరాఫ్ బజార్‌లో శుక్రవారం సాయంత్రం ఓ కారు బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన కారు ఎదురుగా వస్తున్న స్కూటరిస్టుతో పాటు, బంగారు దుకాణం ముందు నిల్చున్న మరో యువకుడిని ఢీకొట్టి, దుకాణాల ముందు నిలిపిఉంచిన బైకులను ఢీ కొట్టింది. వివరాలు.. తిరుమల అనే యువకుడు కారును వేగంగా డ్రైవ్ చేసుకుంటూ షరాఫ్ బజార్ వైపు వస్తుండగా అదుపుతప్పి ఎదురుగా బైక్‌పై వస్తున్న సామేల్ అనే యువకుడిని ఢీ కొట్టడంతో ఎగిరి కారు అద్దంపై పడ్డాడు. కారు దూసుకెళ్లి షాప్ ముందు నిల్చున్న షాదీన్ అనే యువకుడిని ఢీ కొట్టి, అక్కడ నిలిపిఉంచిన బైకులను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో సామేల్, షాదీన్ ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనా చేరుకొని ప్రమాదానికి కారణమైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంపై విచారణ చేపట్టారు.

జగనన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయబోమని ఆస్పరి మండలం మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆమె భర్త దేవనకొండ మండలం మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు స్పష్టం చేశారు. హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో కొలువుదీరిన షేక్షావలి, షాషావలి దర్గాలను వారు శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో టీడీపీ అభివృద్ధికి ఎంతో కష్టపడినా గుర్తింపు దక్కలేదని వాపోయారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు విధి, విధానాలు నచ్చలేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుండడంతో ఆకర్శితులై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడు ఆశయ సాధన కోసం పనిచేయాలనే లక్ష్యంతో ఉన్నామని, తమను నమ్ముకున్న వారికి మేలు జరగాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ప్రశాంతంగా వాహనాల వేలం

ఆలూరు రూరల్: ఆలూరు, హాలహర్వి, ఆస్పరి పోలీసు స్టేషన్ల పరిధిలో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన 53 వాహనాలను స్థానిక ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణలో శుక్రవారం వేలం వేశారు. వేలం పాటను ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి సమక్షంలో నిర్వహించారు. పట్టుబడిన 53 వాహనాలకు వేలం పాటలో రూ.12,72,136 ఆదాయం వచ్చిందన్నారు. ఈ నగదును ప్రభుత్వ ఖాజానాకు జమ చేస్తామన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ.. అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆలూరు సర్కిల్ పరిధిలోని క్షేత్రగుడి, మార్లమడికి కర్ణాటక సరిహద్దు గ్రామాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేమన్నారు. అక్రమ మద్యం తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని చెప్పారు. ఎస్‌ఐలు డాక్టర్ నాయక్, వరప్రసాద్, నాగేంద్ర, శ్రీనివాసులు ఉన్నారు.



ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణలో వేలంపాట నిర్వహిస్తున్న పోలీసులు